# దుష్టశక్తులు

—: రచన :—
బుద్ధుల వేంకటరమణారెడ్డి.

"అమ్మా! అవన్నీ ఎక్కడికే అలా పరుగెత్తిపోతున్నాయి" అని తన ఆరేండ్ల సుగుణ తల్లి శాంతను ప్రశ్నించే సరికి ఆమె ఆలోచనలు ఛిన్నాభిన్నములైపోయాయి. మరో సారి ఆమె ఇహలోకంలో పడి విలవిల తన్నుకోసాగింది. తనెందుకు, ఎక్కడికి పోతున్నాదో ఆమెకి మనసుకొచ్చినపుడల్లా హృదయం ద్రవించిపోతోంది. మనసు వేయిముక్కలై పోతోంది. తాను రైల్లో తన ఒక్కగాని ఒక్కకూతురుతో పుట్టింటికిపోతూంది ఎందుకు ?

అంత దయాస్వభావుడు అలా మారిపోతాడని ఆమె ఎలా అనుకుంటుంది. "ఇంతకీ అంతాఖర్మ పాపిష్టిబ్రతుకు" అనుకొంటూంటుంది ఆమె.

" ఎలా పోయి తండ్రి నడగడం ? " ఈ ప్రశ్న ఆమెని కుతకుత ఉడుకబెట్టింది. కుమిలి కుమిలి ఏడ్పించింది. పెట్టెలోనివారంతా వింతగా ఆమెవైపు చూస్తున్నారన్నజ్ఞానం కూడా ఆమెకి లేకుండాపోయింది. మరి ఏడేండ్లు కాపురం చేసిన భర్త ఈనాడు తన్ను తన కట్నంబాపతు తీసుక రమ్మని పుట్టింటికి పంపుతూంటే పోతూన్న తనకి ఎలా బాహ్యప్రపంచం అగుపడుతుంది ?

గత జీవితమంతా సినిమా రీలులా ఆమె ముందు తిరిగింది. తన బాల్యం...అదీ అలాగే గడచిపోయింది. నాన్న తాలూకాఫీసు గుమస్తా. వచ్చేవి ఏ నలభైయైదు రూపాయలు. ఇంట్లో అమ్మ, ఇద్దరు అక్కగార్లు జీవితం గడపటం ఓ దుర్లభ సమస్యగా ఉండేది. నాన్న అమ్మని వేపుక తింటూండేవాడు. ఆడబిడ్డలంటే ఆయన మండిపోయేవాడు. తన బాల్యంలో ఓనాడైనా తండ్రి తనని ఎత్తుకొన్నాడా! ముద్దాడాడా! ఏనాడూ లేదు. ఏలాగోలాగు దొర్లిపోయాయి ఆరోజులు. తన ఇద్దరక్కగార్ల వివాహాలయే సరికి మూడువేలు అప్పు నిలచింది. అదీ తన తాత ముత్తాతలు సంపాదించిన రెండెకరాల పొలం అమ్మి పెండ్లికి ఖర్చుపెట్టాడాయెను. కట్నం ఒక్కొక్కరికి రెండువేలు పోయవలసొచ్చింది. బండంత చాకిరీ. వచ్చే జీతంరాళ్ళు మిగలితేగా !

ఇలాటి సమయాల్లో ఓనాడు అమ్మ తన పెళ్లిమాట ఎత్తి నాన్నను ఎంత గాయపరచిందో, ఆయన ఎంతగా కోప్పడ్డాడో శాంతకు బాగా మనసుకొచ్చింది. ఏలాగో ఓలాగు లోకానికైనా వెరచి తనపెండ్లి మొదలెట్టాడు. పెళ్లికి ప్రయత్నాలు చేశారు. అందరూ వచ్చారు. పెళ్ళిమాత్రం ఆగిపోయేటట్టే అగుపడింది. ఆనాడు ఎంత కుమిలి కుమిలి ఏడ్చింది. ఎప్పటికీ ఒకటే పాపిష్టిబ్రతుకు అనుకొంది.

కట్నం రెండువేలు తక్షణం చెల్లిస్తేగాని పెండ్లిచేసుకోనన్నాడు పెండ్లికొడుకు. ఇస్తానన్నాడునాన్న. మరిఎక్కడుంచీ తెచ్చిస్తాడు? పెళ్లికొడుకుకు పెళ్లిపెద్దలు సమాధానం చెప్పేసరికి శాంతించాడు. ఏలాగో పెళ్లయిపోయిందని చేసేశాడు నాన్న.

అత్తగారిల్లు తొక్కింది. అప్పట్నుంచే బ్రతుకు ఇంకా నీచమనిపించింది. అత్తగారి ఎత్తిపొడుపులు, ఆడబిడ్డల అదమాయింపులు ఎక్కువయిపోయాయి. ఇంటిపనంతా తనమీదే పడింది. చేస్తాననుకొంది. కానిమాటలు సూటిగా, అకారణంగా తగలసాగాయి. ఎలా ఓరుస్తుంది? ఇలాటి రోజులుకూడా ఆమె గడపేసింది.

ఏడెనిమిదేండ్లు సంసారంచేసిన భర్త ఈనాడు తనకు కాకుండాపోయాడంటే ఆమెకి పట్టలేనంత దుఃఖమొచ్చింది.

"కట్నం తీసుకురా. లేకపోయావా గడప త్రొక్కద్దు" అన్నాడు భర్త.

అయినా తనభర్తది తప్పుగాదని ఆమెకి బాగాతెలుసు. వెనుక నాట్యమాడించేవారున్నారని తెలుసు. దుష్టశక్తులు అతన్ని ఆవరించినపుడు అతడెలా ఊరుకొంటాడు. ఏం చేస్తాడు. తల్లి, అక్క చెల్లెళ్లు ఒకేపోరుపెట్టుకొని తనచెవిలో ఊదేవారు? అతడికి ఒకేమార్గం గోచరించింది. తనమీద విరుసుకపడ్డాడు. తనకి అది బాధాకరమే. అయితే అంత మందిని తాను ఎదిరించి జీవితం గడుపగలడా! బాల్యం నుంచీ ఉన్న సహనం, ఓర్పు, ఎలా వదుల్తాయి. నాన్న ఎంత కోప్పడ్డా, 'నా కడుపున ఎందుకు పుట్టితివే; చావరాదూ' అన్న అమ్మమాటలకే ఓర్పువహించి ఏడ్చిఏడ్చి బ్రతికినరోజులుకూడా లేకపోలేదు. ఐతే తానేంచేస్తుంది? స్త్రీ జన్మం ఎత్తడమే మహా పాపమనిపించింది. ఇంతకీ తన తప్పు ఏముంది? ఎందుకిలా తనజీవితం బాధాకరంగా పరిణమించింది? ఇలాటి ప్రశ్నలు ప్రశ్నలుగానే ఉండిపోయాయి.

* * * *

ఎలాగైతేనేం రైలు దిగింది. ఇల్లు చేరింది. తల్లిచూసి కన్నీరు కార్చింది. ఎంతైనా కన్నకడుపుకు కనికరముండదూ మరి. తండ్రి వచ్చాడు. తనని సరిగానైనా పలుకరించలా. తన చిన్నిబిడ్డనైనా చేతికి తీసుకోకపోయేసరికి ఆమె మనసు చాలా బాధపడింది. అలాటి మూగబాధలు ఏలా ఎవరికి తెలుస్తాయి.

కిక్కురుమనకుండాఉన్న తండ్రిని ఏలా పరామర్శించి తను వచ్చినకార్యం నివేదించడం? ఆమెకి భయమేసింది. ఆరోజు ఎలాగో గడచిపోయింది.

రాత్రంతా అమ్మ చెప్పింది. అప్పు నాల్గువేలుదాకా పెరుగుతూందని, ఉన్నఇల్లు అమ్మినా ఇంకా రెండువేలు మిగులుతుందనీ, ఇక తనెలా తండ్రినడగడం? తాను పుట్టినప్పటినుంచీ ఒకేబాధ. తల్లిదండ్రులను చాలా వేధించాననుకొంది.

పుట్టింట బాధలు, అత్తింట బాధలు ఇక సహించటం ఆమెకు చేతకాదేమో అనిపించింది. అప్పటికి ఒక్కసారిగా ఆమె జీవితంపై రోత జనించింది. తనభర్తకు ఎలా మొఖం చూపించటం? తాను ఎంత లోకువ కాగలిగిందో తెలిసికొనేసరికి ఆమెప్రాణం అవమానంచే, అభిమానంతో కృంగిపోయింది.

ఈ దుష్టశక్తుల్నుంచీ విడిపోతే...తల్లి, తండ్రి, భర్త, అత్త ఇత్యాదులు. అయితే తన సుగుణ...ఎలా జీవిస్తుంది. ఒక్కసారి సుగుణను హృదయానికి హత్తుకొంది. పుట్టించినవాడు పెట్టకపోతాడా అనే ధీమా ఆమెలో ప్రవేశించింది.

తన తల్లిపై ఆమెకు ఓ రకంగా సానుభూతి కల్గింది. ఓవేళ తాను చనిపోతే అమ్మ ఏడుస్తుంది అనుకొంది శాంత. చనిపోవడమంటే ఆమెకి భయమనిపించింది. రేపటివరకు బ్రతికేఉంటే తాను ఎందరిని వేధించాలె. ఎన్ని తిట్లు తినాలే. ఎంత బాధపడాలె ఇత్యాదులు ఒక్కసారిగా ఆమె కల్లోలహృదయాన్ని అణచిపెట్టాయి. తుఫాను వచ్చేముందు సముద్రంలా ఆమె గంభీరత వహించింది.

అంతే. ఆనాడే ఆమె ఈలోకంలోని సుఖదుఃఖాల్ని అనుభవించిన కడపటిరోజు. ఇన్నిదినాలుగా తనని ఎదిరిస్తున్న దుష్టశక్తులకు లొంగిపోయింది. తన ప్రాణమే బలి ఇచ్చింది. ఆమె మూగబాధలు ఆమెతోనే అంతరించిపోయాయి. ఆమెనుగూర్చిన బాధ ఇక ఎవరికీ లేదు. అంతే.

# ముసలాడి * * మూడో పెళ్లి!

రచన: "నేనే!?"

●

అబ్బో! యెంత గడుసువాడు! ముసలివాడా! గడుసువాడా! ఎవరీ ముసలి? వయ్యాకరణులు వ్యాఖ్యానం చేస్తారు—"ముసలి" అనకూడదు, "ముదుసలి" అనాలి అని. ముసలి అనే మూడక్షరాలు వినగానే ముక్కోపయ్యే ముసలాడికి "ముదుసలి" అని నాల్గక్షరాలు వ్యాకరణరీత్యా అంటే మరెట్టుంటుందో వూహించాలి మీరే. ముసలైతే మనకేం? ఏం లాభం? ఇద్దరు పెళ్లికూతుళ్ళను యేట్లో గలిపి మూడోపెళ్లికి ముచ్చట్లాడుతున్నాడు.

బుగ్గలు పాతాళానికి పీక్కెళ్ళాయి. వెంట్రుకలా స్వచ్ఛమైన తామ్రరేకుల్లాగున్నాయి. క్రాప్‌డ్‌హెడ్, ధరించేవి గ్లాస్కో ధోవతులు, సంవత్సరచందాగట్టి "ఆంధ్ర పత్రిక" తెప్పిస్తున్నాడు. దేనికి? నెరిసిన వెంట్రుకలకు ఔషధం, వీర్యవృద్ధినిజేసే మందులు మొదలైనవాటినిగురించిన అడ్వర్టయిజ్‌మెంట్లు చదివి తెప్పించాలని. మాటలసందటి మరుపొచ్చింది—దంతాల సంగతి. ప్రకృతిదంతం ఒకటివుంటే వొట్టు. అన్నీ కృత్రిమ దంతాలే. మరి మూడోపెళ్ళి చేసుకోబొయ్యే ఆ తాతయ్య వయస్సెంతుండాలి? తాతయ్య అనగానే తెలుస్తుందిగా అరవైయ్యో పడిలో పడుంటాడని. ఆయన చెల్లెలి (విశ్వస్తలెండి) కి 50,40 సంవత్సరాలమధ్యవున్నాదనుకోండి. వయస్సు లోకానికేం చెప్పమన్నాడు? మన తాత—"అమ్మాయీ నీ వయస్సుకూడా యెవరన్నా ఎంతని ప్రశ్నిస్తే 35 అని జవాబీ, మరి నేను 45 అనేస్తా! ఏం?"

"ముసలి" అనిపిస్తాడా, ఎంతమాత్రం కాదు. న్యూస్‌పేపర్లలోని అడ్వర్టయిజ్‌మెంట్ల ఫలితంగా కాస్తకాస్త నల్లగామారుచున్న ఆ మిశ్రకేశములు, డాక్టర్ కోరాగారి సహాయాన ఆతెల్లటి ఆర్టిఫిషియల్ పండ్లు, చేతిలో Hand Stick ఆ తెల్లటి గ్లాస్కో ధోవతలు, నోట్లో Capstan సిగిరెట్టు, కండ్లకు Wilson చలవద్దాలు, చేతికో West-end రిష్టువాచీ, (బంగారు Chainతో సహా) వ్రేళ్లకు ఉంగరాలు, గోళ్ళకు ఎరుపురంగు, మెడలో సన్నని నైస్‌గా ఒక Gold-Chain ధరించి దండయాత్ర మొదలెట్టాడు మూడో కన్యాన్వేషణానికి. పాపం ఏ ఖర్మంజాలనిపిల్ల పడుతుందో ఆ పకీరి వల్లో. చూస్తున్నాంగా, ఇలాంటివాళ్ళను యీయంత్రయుగంలో. అందరికీ తప్పక తెలిపేస్తాడనే మన చిత్రగుప్త కంపాను. చిత్రగుప్తద్వారా కన్యను కలిగిన తలిదండ్రులు మేల్కొందురు గాక!